ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

జాతీయ వార్తలు

తేది: 27.06.2026 సమయం: 19.05 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు రోజుల పర్యటన నిమిత్తం సీషెల్స్ రాజధాని విక్టోరియా చేరుకున్నారు.
2. ప్రపంచవ్యాప్తంగా ఏ ఆర్థిక వ్యవస్థ బలమైనా, MSME రంగం అందించే సహకారంపైనే ఆధారపడి ఉంటుందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు.
3. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని ఆలోచనలను దేశ, విదేశాల ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ఆకాశవాణిలో ప్రసారమవుతుంది.
4. రాబోయే రెండేళ్లలో భారత్ టాక్సీ సేవలను దేశవ్యాప్తంగా 500 నగరాలకు విస్తరించనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు.

-----------------------------

**REV PM SEYCHELLES**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు రోజుల పర్యటన నిమిత్తం సీషెల్స్ రాజధాని విక్టోరియా చేరుకున్నారు. విమానాశ్రయంలో సీషెల్స్ అధ్యక్షుడు డాక్టర్ పాట్రిక్ హెర్మినీ ఘనస్వాగతం పలకడం పట్ల మోదీ సోషల్ మీడియా ద్వారా హర్షం వ్యక్తం చేశారు. హిందూ మహాసముద్రంలో సీషెల్స్ తమకు అత్యంత విలువైన వ్యూహాత్మక భాగస్వామి, సన్నిహిత మిత్రదేశమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. భారత్-సీషెల్స్ మధ్య సుదీర్ఘకాలంగా ఉన్న సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి,ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం సహకారాన్ని పెంపొందించే దిశగా ఈ పర్యటన విజయవంతం అవుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

విమానాశ్రయంలో తనకు ఘనస్వాగతం పలికిన ప్రవాస భారతీయులకు  ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపారు. భారత్ లోని వివిధ ప్రాంతాల సంస్కృతీ సంప్రదాయాలను ప్రవాస

భారతీయులు కాపాడుకుంటూ, వేడుకలుగా జరుపుకుంటున్న తీరు ప్రశంసనీయమని కొనియాడారు. సీషెల్స్ చారిత్రాత్మక 50వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. సీషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకలకు హాజరవుతున్న మొట్టమొదటి భారత ప్రధాని ఆయనే కావడం విశేషం.

**NSD**

---------------------------

**REV. VP-MSME DAY**

ప్రపంచవ్యాప్తంగా ఏ ఆర్థిక వ్యవస్థ బలమైనా, MSME రంగం అందించే సహకారంపైనే ఆధారపడి ఉంటుందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన MSME దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ, భారత్ లో ఈ రంగం మొదటి తరం పారిశ్రామికవేత్తల ధైర్యానికి, వ్యవస్థాపక స్ఫూర్తికి ప్రతీక అని కొనియాడారు. దేశం మొత్తం ఎగుమతుల్లో దాదాపు 50 శాతం వాటాను కలిగి ఉంటూనే, ఉన్నత ప్రమాణాలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్‌గా ఎదిగే ప్రయాణంలో ఎంఎస్ఎమ్ఈ రంగం అత్యంత బలమైన స్తంభంగా మారిందన్నారు .

**BYTE-C P RADHAKRISHNAN**

ప్రస్తుత ప్రపంచ వ్యాపార రంగంలో వ్యయ సమర్థత చాలా అవసరం. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ఉత్పత్తుల ధరలు అందుబాటులో ఉండేలా వ్యాపారాలు చేయాలని పిలుపునిచ్చారు.ఉత్పాదకత, నాణ్యతను మరింత పెంపొందించడానికి పారిశ్రామికవేత్తలు ఆధునిక సాంకేతికతను అలవర్చుకోవాలని ఉప రాష్ట్రపతి కోరారు.

**NSD**

---------------------------

**TET POSTPONED**

మహారాష్ట్రలో రేపు జరగాల్సిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (TET) ప్రశ్న పత్రం లీక్ అవ్వడంతో పరీక్షను వాయిదా వేస్తున్నట్లు, మహారాష్ట్ర స్టే కౌన్సిల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రకటించింది. థానేలోని భివాండి పరిధిలో కొందరు వ్యక్తుల వద్ద, లీకైన పరీక్షా పత్రాలు ఉన్నాయనే

సమాచారంతో, పోలీసులు దాడి చేసి వారిని పట్టుకున్నారు. పారదర్శకతను కాపాడటానికే పరీక్షను వాయిదా వేశామని, తదుపరి కొత్త తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని అధికారులు వెల్లడించారు.

**NSD**

---------------------------

**SCINDIA GUNA VISIT**

కేంద్ర సమాచార, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఈరోజు నుంచి గుణాలో మూడు రోజుల పర్యటనను ప్రారంభించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలు బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ ఉదయం సర్క్యూట్ హౌస్‌లో ప్రజలను కలుసుకున్న కేంద్ర మంత్రి, వారి సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారంలో భాగంగా కంజా గ్రామంలో 700 మొక్కలను నాటారు. అనంతరం రుథియాయ్ వద్ద సౌర విద్యుత్ ప్లాంట్‌ను ప్రారంభించి, పటాయ్ గ్రామంలోని రామాలయ పునరుద్ధరణ పనులకు భూమి పూజ చేసారు. జీతో బాడ్మింటన్ అకాడమీని ప్రారంభించి, గుణా రైల్వే స్టేషన్ నుండి బినా-గుణా-ఇండోర్ మెము రైలు సర్వీస్‌ను జెండా ఊపి ప్రారంభించారు.

**NSD**

---------------------------

**OIL WEEKLY**

ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మునుపటి నాటి స్థాయికి పడిపోయాయి. హోర్ముజ్ జలసంధి గుండా రవాణా మెరుగుపడటంతో, బ్రెంట్ క్రూడ్ ధర 10.6 శాతం పతనమై 71 డాలర్లకు చేరుకుంది. చమురు ధరల తగ్గుదల,విదేశీ పెట్టుబడుల రాకతో దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం కూడా లాభాల్లో ముగిశాయి. BSE సెన్సెక్స్ 298 పాయింట్లు లాభపడి

77,100 వద్ద, NSE నిఫ్టీ 43 పాయింట్లు పెరిగి 24,056 వద్ద ముగిసి, వరుసగా మూడో వారం కూడా ఇన్వెస్టర్లకు లాభాలను అందించాయి.

**NSD**

---------------------------

**MANN KI BAAT**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని ఆలోచనలను దేశ, విదేశాల ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ ప్రసంగం రేపు ఉదయం 11 గంటలకు ఆకాశవాణిలో ప్రసారం అవుతుంది. ఇది ప్రతినెలా ప్రసారమయ్యే రేడియో కార్యక్రమంలో 135 సంచిక. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ మొత్తం నెట్వర్క్, AIR న్యూస్ వెబ్సైట్, కేంద్ర సమాచార, ప్రసార శాఖ YouTube ఛానెళ్లలో కూడా ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. హిందీ ప్రసంగం ముగిసిన వెంటనే తెలుగు అనువాదం ప్రసారం అవుతుంది. తిరిగి రాత్రి 8 గంటలకు తెలుగు అనువాదం పున ప్రసారమవుతుంది.

**NSD**

---------------------------

**JK CIK RAIDS**

చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం  కింద జరుగుతున్న దర్యాప్తులో భాగంగా ఈరోజు కాశ్మీర్ లోయ అంతటా, కౌంటర్ ఇంటెలిజెన్స్ కాశ్మీర్ అధికారులు పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. శ్రీనగర్, గందర్‌బల్, కుప్వారా, అనంత్‌నాగ్‌లతో సహా నాలుగు జిల్లాల్లోని ఐదు ప్రాంతాలలో ఈ తనిఖీలు చేపట్టారు.2023లో కౌంటర్ ఇంటెలిజెన్స్ కాశ్మీర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన జాయింట్ ఇంటరాగేషన్ సెంటర్‌లో నమోదైన కేసు దర్యాప్తుకు సంబంధించి ఈ దాడులు జరుగుతున్నాయని, అధికారులు వెల్లడించారు.

**NSD**

---------------------------

**FUR. REV. AMIT SHAH GUJARAT**

సహకార రైడ్-హెయిలింగ్ ప్లాట్‌ఫార్మ్ 'భారత్ టాక్సీ'ని హోం మంత్రి అమిత్ షా ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... రాబోయే రెండేళ్లలో ఈ సేవలను దేశవ్యాప్తంగా 500 నగరాలు, పట్టణాలకు విస్తరించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్న ప్రైవేట్ యాప్ ఆధారిత టాక్సీ సంస్థలు డ్రైవర్లపై భారీ కమిషన్లు వేస్తూ, అకారణంగా అకౌంట్లను నిలిపివేస్తున్నాయని మండిపడ్డారు. 'భారత్ టాక్సీ' ద్వారా డ్రైవర్లను భాగస్వాములను చేస్తూ, వారికి ఎక్కువ ఆదాయం అందేలా, ప్రయాణికులకు సురక్షితమైన సేవలు అందించడమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. ప్రసిద్ధ 'అమూల్' సహకార ఉద్యమ స్ఫూర్తితోనే ఇది పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

**S/B – AMIT SHAH**

**NSD**

---------------------------

**IMD- WEATHER**

రాగల మూడు నుండి నాలుగు రోజుల్లో గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని మరికొన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే రెండు పశ్చిమ బెంగాల్,సిక్కింలలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. బీహార్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కరైకల్,ఈశాన్య భారత దేశంలోని కొన్ని ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాగల 24 గంటల వరకు తూర్పు రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో ఉరుములు, మెరుపులు,ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

**NSD**

---------------------------

**DONALD TRUMP AVENUE - HYD**

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో తన పేరు మీద ఒక రోడ్డుకు నామకరణం చేయడం పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో ఒక పోస్ట్ చేశారు. 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' నామకరణం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన ఆయన.. భారత్ లో ఒక రహదారికి పేరు పెట్టడం ద్వారా, ఈ ఘనత సాధించిన తొలి అమెరికా అధ్యక్షుడిగా నిలిచానని పేర్కొన్నారు. ఈ గుర్తింపుపై హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్ కూడా కృతజ్ఞతలు తెలుపుతూ, ఇది ఇరు దేశాల మధ్య నిరంతరం బలపడుతున్న భాగస్వామ్యానికి నిదర్శనమని కొనియాడారు.

**NSD**

**----------------------------**

**BADMINTON US OPEN**

యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత్ కు చెందిన దేవిక సిహగ్, రౌనక్ చౌహాన్, కిదాంబి శ్రీకాంత్ సెమీఫైనల్స్‌కు చేరుకున్నారు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్ లో దేవిక 22-20, 21-19తో వరుస గేముల్లో జపాన్‌కు చెందిన థర్డ్ సీడ్ రికో గుంజీ పై విజయం సాధించింది.

పురుషుల సింగిల్స్ లో రౌనక్ చౌహాన్ ఇజ్రాయెల్‌కు చెందిన మిషా జిల్బర్‌మాన్‌పై 23-21, 21-11 తేడాతో విజయం సాధించాడు.

ఆ తర్వాత కిదాంబి శ్రీకాంత్ కూడా చైనీస్ తైపీకి చెందిన లియావో జువో-ఫుపై 21-9, 12-21, 21-8 తో విజయం సాధించి సెమీఫైనల్స్ లో తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు.

సెమీఫైనల్స్‌లో చౌహాన్ చైనీస్ తైపీకి చెందిన సు లీ యాంగ్‌తో, శ్రీకాంత్ జపాన్‌కు చెందిన యుదై ఒకిమోటోతో తలపడనున్నారు.

**NSD**

**----------------------------**

**TRIPURA FESTIVAL**

న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగే 'త్రిపుర గ్లోబల్ పైనాపిల్ ఫెస్టివల్'ను త్రిపుర ముఖ్యమంత్రి డాక్టర్ మాణిక్ సాహా, కేంద్ర ఈశాన్య ప్రాంత

అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. త్రిపుర రాష్ట్రం ఏటా సుమారు 1.78 లక్షల నుండి 1.87 లక్షల మెట్రిక్ టన్నుల పైనాపిల్స్ ను ఉత్పత్తి చేస్తుందని, ఇందులో మార్కెట్ సరఫరా కోసం దాదాపు 23 వేల మెట్రిక్ టన్నుల భౌగోళిక గుర్తింపు పొందిన 'క్వీన్ పైనాపిల్' రకం కూడా ఉందని తెలిపారు. ఈ పండు రాష్ట్ర సాంస్కృతిక వారసత్వానికి, వ్యవసాయ రంగానికి ఒక ప్రతీక అని ఆయన అభివర్ణించారు.

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ మాట్లాడుతూ...236 కోట్ల రూపాయల 'మిషన్ క్వీన్ పైనాపిల్' పథకం ద్వారా ఈ పండు ఆర్థిక విలువను 2028 నాటికి 35 కోట్ల నుండి 200 కోట్లకు పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇది గ్రామీణ ఆదాయాన్ని, ఎగుమతి సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.

**NSD**

**----------------------------**

**BHAGYARAJ PASSED AWAY**

ప్రముఖ తమిళ సినీ నటుడు, దర్శకుడు కె. భాగ్యరాజ్ ఈరోజు ఉదయం చెన్నైలో గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన వయస్సు 73 సంవత్సరాలు. విలక్షణమైన స్క్రీన్‌ప్లే, చమత్కారమైన సంభాషణలతో తమిళ సినిమాలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న భాగ్యరాజ్, ఎన్నో బ్లాక్‌బస్టర్ తమిళ చిత్రాలను, ప్రజాదరణ పొందిన హిందీ చిత్రం 'ఆఖ్రీ రాస్తా'ను తెరకెక్కించారు. ఆయన 25కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించగా, దాదాపు 75 సినిమాల్లో నటించారు. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, డిఎంకె అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తదితరులు  పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమిళనాడు ప్రభుత్వం రేపు చెన్నైలో భాగ్యరాజ్ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

**NSD**

**----------------------------**